డిటెక్టివ్ కథ

# కనికట్టు

చిత్రభాను

రాజ్‌కుమార్ పోర్టికోలో కారాపి, ఆదరాబాదరా దిగి, మెట్లెక్కబోతూ తటాలున ఆగాడు. గుమ్మంలోకి పరుగున వచ్చి నిలుచున్న భార్య నిశ్చలను ఆత్రుతగా, ఆశగా చూశాడు.

''కీర్తి ఇంట్లో లేదా?''

నిశ్చల ప్రశ్న రాజ్‌కుమార్ ఆశ మీద ఐస్‌వాటర్‌లా పని చేసింది.

''లేదు... వారం రోజులుగా లాలస కీర్తి యింటి వైపే వెళ్ళలేదట..''

రాజ్‌కుమార్ నీరసంగా మెట్లెక్కుతూ అన్నాడు. ''లాలసను బైటికి వెళ్ళ నీయకుండా వుండాల్సింది..''

''బలేవారే! రోజూ కాళ్ళు చేతులూ కట్టేసి, క్లాసు రూముల్లో కూలేస్తున్నాం! శెలవు రోజునా కట్టడి చేయగలమా పిల్లల్ని? ఆడుకోడానికి వెళ్తానంది.. చీకటి పడక ముందే వచ్చేయమని చెప్పి వెళ్ళమన్నాను..''

రాజ్‌కుమార్ నిట్టూరుస్తూ, మెట్ల మీద నీరసంగా కూలబడ్డాడు. లాలస అందమైందేకాదు; చాలా తెలివైంది కూడా! అమ్మకు, నాన్నకు చెప్పకుండా అడుగుకూడ కదపదు! చిన్నప్పట్నుంచీ క్రమశిక్షణ అలవాటు చేశారు. లాలస కనిపించకుండా పోయి నాల్గుగంటలు కావస్తోంది.

''కూచుంటే ఎలాగండీ! చీకటి పడుతోంది...'' నిశ్చల ఆందోళనగా అంది. ''ఎక్కడో.. దారితప్పి తిరుగుతూ వుంటుందండీ... దాని చెవుల్లో రింగులు ఎవడి కంట్లోనే పడకముందే..''

రాజ్‌కుమార్ ఉలిక్కిపడి లేచాడు. భార్యమాటలు వింటూంటే అతని గుండె దడదడ కొట్టుకుంది. పేపర్లో చదివిన, టీవీలో చూసిన వార్తలు చకచకా గుర్తొస్తున్నాయి. ''రోల్డుగోల్డు రింగులని తెలీక - వాటికోసం పసిపిల్లను కడతేర్చిన కిరాతకుడు!'' 'దుద్దుల కోసం చిన్నారి గొంతు నులిమిన కసాయి'... 'లారీచక్రం కింద పసిపాప దుర్మరణం'...

''నిశ్చలా... ఎస్.పీ. రంజన నీ ఫ్రెండేకదా! ఆమెకి ఫోన్‌చెయ్... నేను... చిల్డ్రన్‌పార్కు వేపు వెళ్తాను..'' రాజ్‌కుమార్ మెట్లమ్మట కిందికి పరు గెత్తాడు. కారు తలుపు తెరవబోతూ, గేట్లోంచి వస్తున్న 'ఇన్నోవా'ను చూస్తూ ఆగాడు...

ఆగిన ఇన్నోవాలోంచీ రవి దిగాడు. రవి రాజ్‌కుమార్ లాగే 'రవిరాజా ఇండస్ట్రీస్' పార్ట్‌నర్. రవికిరణ్ తండ్రి సుందర్రావు, రాజ్‌కుమార్ తండ్రి కాంతారావు బాల్యమిత్రులు. స్నేహితం ఆ ఇద్దర్నీ శాశ్వతంగా కలిపే వుంచింది. యువకులుగా వున్నప్పుడు ఇద్దరూ తమ ఇద్దరుకుమారుల పేర్లు కలిసి వుండేలా తాము స్థాపించిన పరిశ్రమకి 'రవి రాజా ఇండస్ట్రీస్' అనే పేరు పెట్టారు. ఇద్దరూ వృద్ధులయ్యారు. వ్యాపారాన్ని జాయింట్‌గా కొడుకులిద్దరికీ అప్పజెప్పి, రిటైరై పోయారు. వృద్ధుల కోసం తామే ఎప్పుడో స్వగ్రామం సమీపాన స్థాపించిన 'వానప్రస్థం' అనే వృద్ధాశ్రమానికి వెళ్ళిపోయారు!

''హై! రాజ్!'' కారు దిగిన రవికిరణ్ రాజు వైపు వస్తూ అన్నాడు.

రాజ్‌కుమార్ తల ఆడించాడు.

''హాయ్ సిస్టర్!'' రవికిరణ్ నిశ్చలను చూస్తూ అన్నాడు. ''సంగీత కాఫీ యిస్తానంటే వద్దని, వచ్చేశాను! నిర్మలంగా కూచుని, నిశ్చల చేతి కాఫీ తాగుతానని చెప్పాను తనకి!''

''అన్నయ్యా... లాలస... కనిపించడం లేదు..'' నిశ్చల ఏడుపు ఆపుకుంటూ అంది.

''వాట్!?'' రవికిరణ్ ఆగి అరిచాడు'' ఏమైంది? ఎక్కడికెళ్ళింది? రాజ్... నీకు బుద్ధుందా? నాకు ఫోన్ చేయాలా వద్దా?''

''సారీ రవీ... కంగారులో తోచలేదు..''

''ఇంతకీ లాలస ఎక్కడికెళ్ళింది!'' రవికిరణ్ ఆదుర్దాగా ప్రశ్నించాడు.

నిశ్చలా, రాజ్ - ఇద్దరూ జరిగిందంతా అతనికి వివరించారు.

రవికిరణ్ మాట్లాడకుండా జేబులోంచీ మొబైల్ తీశాడు. డయల్ చేసి, చక చక మాట్లాడసాగేడు! ''సంగీతా! వెంటనే బయల్దేరు! పాప లాలస మిస్ అయ్యింది. నేనూ రాజ్ - వెతకడానికెళ్తున్నాం. నిశ్చల ఒక్కటే ఇంట్లో...'' రవికిరణ్ ఆగి విన్నాడు. ''అవన్నీ నిశ్చల చెప్తుంది నాకు! అయిదు నిమిషాల్లో ఇక్కడుండాలి! క్విక్!''

''రాజ్! పోలీస్ రిపోర్టివ్వడం మంచిది!'' మొబైల్ కట్‌చేసి అన్నాడు రవి కిరణ్.

''ఎస్పీ రంజన మన నిశ్చల ఫ్రెండే... నిశ్చల ఆమెతో మాట్లాడుతుంది..'' రాజ్‌కుమార్ అన్నాడు.

''కమాన్! కారెక్కు! చెరోవైపు వెతుకుదాం!'' అంటూ రవికిరణ్ తన కారు వైపు నడిచాడు. డోర్ తెరవబోతూ ఆగి, నిశ్చలవైపు చూశాడు.

''సిస్టర్! ఏం భయం లేదు! లాలస క్షేమంగా తిరిగొస్తుంది!''

నిశ్చల మౌనంగా కళ్ళు తుడుచుకుంది.

రెండు ఇన్నోవాలు ఒకదాని వెంట ఒకటి కదిలాయి.

***

రాత్రి పది దాటింది. హాల్లో సోఫాల్లో కూచున్నారు, రాజ్‌కుమార్, నిశ్చలా; రవికిరణ్, సంగీతా.

అందరి ముఖాలనీ విచారం మాస్కుల్లా కప్పేసింది.

''ఎస్పీ రంజనకు చెప్పడం మంచిదైంది!'' నిశ్చల్ని వెళ్లగొడుతూ అన్నాడు రవికిరణ్. ''రోడ్డు ప్రమాదాలలో లాలస లేదు! అది మనందరికీ పెద్ద రిలీఫ్!''

''శత్రువు లెవరైనా పాపను కిడ్నాప్ చేశారేమో అందన్నయ్యా, రంజన...'' నిశ్చల రవికిరణ్‌తో అంది.

''అది పోలీసులకు మొట్టమొదట తట్టే అనుమానం!'' రవికిరణ్ నవ్వుతూ అన్నాడు. ''నేనూ, రాజూ సంపాదించుకోలేకపోయింది అదొక్కటే: శత్రువులు!''

''యస్! మనకెవరున్నారు శత్రువులు!'' రాజ్‌కుమార్ సోఫాలోంచీ లేస్తూ అన్నాడు. ''రవి.. నాకు కూచోబుద్ధి కావడం లేదు! అలా రోడ్లమీద తిరుగు తాను...''

''రాజ్... ధైర్యంగా ఆలోచించు! పాప ఫొటోలు

పోలీసులకి యిచ్చాం. సిటీఅంతా వాళ్ళు గాలిస్తున్నారు. ఇప్పటికే మనిద్దరం రోడ్లన్నీ తిరిగేశాం..''

రాజ్ తల అడ్డంగా వూపాడు. ''నో! నా వల్ల కాదు! నేను కూచోలేను!'' అంటూ గుమ్మం వైపు వెళ్ళసాగేడు.

ఉన్నట్టుండి హాలు మూలలో టేబుల్ మీద వున్న టెలిఫోన్ మోగింది. రవికిరణ్ లేచి టెలిఫోన్ వైపు నడిచాడు. రాజ్ ఆగాడు.

''రంజన అయ్యింటుందేమో, నిశ్చలా!'' సంగీత అంది.

''తనకి నా సెల్ నంబరు తెలుసు! ఇందాకా సెల్‌కే చేసింది..'' నిశ్చల అంది.

''హలో...'' రిసీవరెత్తిన రవికిరణ్ అన్నాడు.

''రాజ్‌కుమార్?'' అవతలి కంఠం ప్రశ్నించింది.

''కాదు.. మీరెవరు?''

''నువ్వెవరో నాకు అవసరం లేదు! నేనెవరో నీకు అవసరం లేదు! రాజ్ కుమార్‌ని పిలు'' అవతలి కంఠం నిర్లక్ష్యంగా అంది.

రవికిరణ్ ముఖం కొద్దిగా ఎర్రబారింది. మౌత్ పీస్‌ని చేత్తో మూసి, రాజ్‌కుమార్ వైపు చూశాడు. ''రాజ్... నీ కోసం..''

''ఎవరూ?'' రాజ్ విసుగ్గా అడిగాడు.

''ఎవడో.. మర్యాదతెలీని మనిషి!'' దగ్గరగా వచ్చిన రాజ్‌కుమార్‌కి రిసీవరందిస్తూ అన్నాడు రవికిరణ్.

''హలో... ఎవరు?'' రాజ్‌కుమార్ ఫోన్లోకి అన్నాడు.

''రాజ్‌కుమారేనా?'' అవతలికంఠం

''ఎవరండీ మీరు?'' రాజ్‌కుమార్ విసుగ్గా అన్నాడు.

''నువ్వు రాజ్‌కుమారేనా? నేను రాజ్‌కుమార్‌తో మాత్రమే మాట్లాడతాను!'' అవతలి కంఠం బొంగురుగా, నిర్లక్ష్యంగా అంది.

''ఏయ్... ఎవర్నువ్వు?'' రాజ్‌కుమార్ కోపంగా అరిచాడు.

''ఓకే! నువ్వు రాజ్‌కుమార్ అనుకుని చెప్తున్నాను..'' అవతలి కంఠం నవ్వుతూ అంది. ''నేను కిడ్నాపర్ ఆఫ్ యువర్ డాటర్ లాలస!''

''వా...ట్!?'' రాజ్‌కుమార్ కంఠం వణికింది.

''యస్! ఇప్పుడు చెప్పు! నువ్వు – రాజ్‌కుమార్వేనా?''

''యస్... ఎవర్నువ్వు? లాలస ఎక్కడుంది? నా పాపని ఎందుకు కిడ్నాప్ చేశావ్?'' రాజ్‌కుమార్ కంఠం బొంగురుగా మారిపోయింది. ముఖం మీద చెమటలు కమ్ముతున్నాయి.

నిశ్చలా, సంగీతా పరుగెట్టుకెళ్ళి, రాజ్‌కుమార్ దగ్గరగా నిలుచున్నారు. రవికిరణ్ తన చేతిని రాజ్‌కుమార్ భుజం మీద వేశాడు.

''నీతో పని వుంది, నీ కూతుర్ని కిడ్నాప్ చేశాను..''

''లాలస... లాలస ఎక్కడుంది?'' రాజ్‌కుమార్ కంఠం వణికింది.

అటువైపు కంఠం ఎగతాళిగా నవ్వింది. ''ఎక్కడుంది? ఎలా వుంది? ఎప్పు డొస్తుంది? – ఇలాంటి రొటీన్ ప్రశ్నలు అడగొద్దు! అడిగితే కూడా ఆన్సర్ రాదు! నీకు ఏం కావాలో నాకు తెలుసు! నీకు – అర్జెంటుగా నీ కూతురు కావాలి! నాకు ఏం కావాలో నీకు తెలీదు! తెలుసుకోవాలని లేదా?''

''ఎ...ఎ... ఏం కావాలి నీకు?''

''గుడ్! నాకేం కావాలో తెలుసుకోవడం మంచిదని తెలుసుకున్నావ్! – నాకు కావాల్సింది నువ్విస్తే, నీక్కావాల్సింది...''

''ఏం కావాలి నీకు?'' రాజ్‌కుమార్ అతనికి అడ్డు తగిలాడు, అతనిలో తలెత్తిన భయం కోపంగా మారుతోంది.


''ఓహ్! విసిగించానా? సారీ! ఏం కావాలో కాదు; ఎంతకావాలో తెలుసుకోవాలి నువ్వు!...''

''ఎంత? ఎంతకావాలి?'' ఆందోళనగా చూస్తున్న భార్య మొహంలోకి చూస్తూ, ఆత్రుతగా అడిగాడు రాజ్‌కుమార్.

''ఏటికి – కోటి... అంటే ఒక ఏడాదికి ఒక కోటి అన్నమాట! అన్నట్టు నీ కూతురి కెన్నేళ్ళు?''

తన్నుకొస్తున్న కోపాన్ని బలవంతాన అణచుకుంటూ, రాజ్‌కుమార్ నిట్టూర్పు విడిచాడు: ''.... ఆరు... ఆరేళ్ళు''

అవతలి వ్యక్తి గొల్లున నవ్వాడు. ''ఈ మధ్యే నీ కూతురికి ఏడవ పుట్టిన రోజు చేశావుగా, అంగరంగ వైభవంగా! నువ్వు 'నిండిన సంవత్సరాలు' చెప్తున్నావ్! నేను రన్నింగియర్ కూడా లెక్కలోకి తీసుకుంటూ! నా లెక్క ప్రకారం నీ కూతురికి ఏడేళ్ళు! ఏటికి కోటి చొప్పున ఏడేళ్ళకు ఏడు కోట్లు...''




''నో... నో...'' అంటూ కంగారుగా అడ్డు తగిలాడు, అప్రయత్నంగా రాజ్‌కుమార్.

''వాట్?! నో? నిజంగా?!'' కిడ్నాపర్ ఆశ్చర్యంగా అన్నాడు. నో! ''ఇవ్వనూ' అనే ముక్క నువ్వు సీరియస్‌గా, పక్కాగా అంటే నీ కూతు రికి ఆరేళ్లు కాదు, నాన్నా, నూరేళ్ళు నిండుతాయ్!''

''నో ప్లీస్... నా అర్థం అది కాదు... అంత మొత్తం..''

''రాజ్‌కుమార్! నువ్వు 'అనే స్థితిలోలేవు; వినే స్థితిలో మాత్రమే వున్నావు! అంచేత విను! ఏడు కోట్ల రూపాయలు – నకిలీ నోట్లు కాదు – చెల్లించి, నువ్వు నాదగ్గర నీకూతుర్ని కొనుక్కుంటున్నావు! గుట్టు చప్పుడు కాకుండా ఏడు కోట్లు రెడీగా వుంచుకో! కుక్కిన పేనులా పడుండు! నో పోలీస్! నో కంప్లెయింట్! జస్ట్ సైలెన్స్! అర్థమైందా? నీ సైలెన్స్ నీ కూతురి ప్రాణానికి లైసెన్స్! గీత దాటితే, ఆరేళ్లు నూరేళ్ళవుతాయ్! ముడుపు ఎలా, చెల్లించాలో రేపు రాత్రి ఇదే టైంకి చెప్తాను! ఎప్పుడు చెల్లించాలో ఇప్పుడే చెప్తాను! కాస్త పెద్దమొత్తం కదా! ఈ క్షణం నుండీ నలభై ఎనిమిది గంటలు! సెవెన్ క్రోర్స్! టూ డేస్! ఓకే? మాన్ వైల్ గుడ్‌లక్ టూయూ!''

రాజ్‌కుమార్ చెవిలో 'క్లిక్' అంది. అతని చెయ్యి వణుకుతూ రిసీవర్ని పడేసింది.



***

''ఏడు కోట్లా?!'' రవికిరణ్ నిర్ఘాంతపోతూ అన్నాడు ''అన్యాయం! దారు ణం! కమాన్ రాజ్! గెటప్! దీన్ని నిర్లక్ష్యం చేయడానికి లేదు!''

''ఎక్కడికి?'' మొహం మీద పట్టిన చెమటను తుడుచుకుంటూ అన్నాడు రాజ్‌కుమార్.

''ఎక్కడికా? పోలీసుస్టేషన్‌కి! రిపోర్టిచ్చి, అట్నుంచీ అటే వెళ్ళి ఐజీగార్ని కలుద్దాం! ఆ కిడ్నాప్ వెధవకోసం వేట వెంటనే ప్రారంభం కావాలి!''

రాజ్‌కుమార్ తల బలహీనంగా ఊగింది. 'తేడా వస్తే పాపకు ఆరేళ్ళు కాదు, నూరేళ్ళు నిండుతాయన్నాడు స్కౌండ్రల్! నాక్కావాల్సింది, కిడ్నా పర్ కాదు రవీ; నా చిట్టితల్లి! వాడు ఆడమన్నట్టు ఆడటం తప్పా నాకు గత్యంతరం లేదు!''

''రాజ్... ధైర్యంగా ఆలోచించు! ఇలాంటి రాక్షసులకు మనలాంటి వాళ్ళు బుద్ధి చెప్పాలి! పోలీసులకి చెప్పకుండా డబ్బివ్వడం చాలా ప్రమాదం... కళ్ళారా తనను చూసిన పిల్లను కిడ్నాపర్ వదుల్తాడని నమ్మలేం...'' రవి కిరణ్ నచ్చచెప్పే ప్రయత్నం చేస్తూ చెప్పుకు పోతున్నాడు.

''రవీ... కిడ్నాపర్ అడిగింది ఇవ్వకపోతే, ఏం జరుగుతుందో ఖచ్చితంగా తెలిసిపోతోంది! అది నిశ్చయం! ఇచ్చాక ఏదో జరుగుతుందన్నది అనుమానం... రిస్కు తీసుకోవడం నాకు ఇష్టం లేదు!'' రాజ్‌కుమార్ అన్నాడు.

''అవునన్నయ్యా... వాణ్ని పట్టివ్వడంకన్నా, పాపాయిని దక్కించుకోవడం ముఖ్యం...'' నిశ్చల కన్నీళ్ళు తుడుచుకుంటూ అంది.

''ఓకే! ఒప్పుకుంటాను... ఒకటా రెండా! వేలా లక్షలా! కోట్లు! ఏడు కోట్లు! ఎక్కణ్నుంచీ తెస్తాం?'' రవికిరణ్ ఆవేశంగా అన్నాడు.

''ఏం చేస్తాం, కిరణ్? ఇవ్వగలరో, లేదో అనేది ఆలోచించకుండా, నోటి కొచ్చినంత అడిగేయడమేనా ఈ కిడ్నాపర్ రాక్షసుడు?'' సంగీత ఉక్రోషంతో అంది. ''ఇద్దరూ కూచుని, ఎలా సర్దాలో ఆలోచించండి!''

రాజు బరువుగా నిట్టూర్చాడు. రవికిరణ్ విరక్తిగా నవ్వాడు. ''ఒకటి రెండురోజుల వార్నింగ్‌లో కోట్లు సర్దగలిగిన నెట్ వర్క్ కాదు, మనది! రాజైనా, నేనైనా–అంతమొత్తం సర్దాలంటే వున్న వ్యాపారాన్ని తెగ నమ్మాల్సిందే! తెలుసా?''

నిశ్చల దోసిట్లో మొహాన్ని దాచుకుంది; ఏడుపు ఆపుకుంటూ...

***

ఉదయం పది గంటలైంది. తెల్లారేదాకా తోడుగా వున్న రవికిరణ్, సంగీతా ఇంటికెళ్ళారు. నిశ్చల సోఫాకి నీరసంగా అతుక్కు పోయినట్టు



# మీరే డిటెక్టివ్!?

నిర్వహణ: అన్య

## హెడ్ లైట్స్

"మీ పరిచయంతో నాక్కూడా తెలివి తేటలు పెరిగాయి" అన్నాడు యువకుడు నవ్వుతూ.

"ఇంతకూ, ఏమైంది?" అడిగాడు డిటెక్టివ్.

"చెబుతాను. కాస్త ఓపిగ్గా వినండి. గతవారం, నేను పని ముగించుకుని, శ్రీనగర్‌లో ఉన్న మా యింటికి డ్రైవ్ చేస్తున్నాను. సగం దూరం వెళ్లానో లేదో, వర్షం ప్రారంభమైంది. చీకటి పడింది. చేసేదేముంది. వర్షం ఆగేదాకా, రెస్టు తీసుకుందామని ఓ బార్లో ప్రవేశించాను. నేను రెండో పెగ్గు తాగుతున్నప్పుడు ఓ అందమైన అమ్మాయి వచ్చి పక్కన కూర్చుంది. చాలా మొహమాటపడుతూ, 'మనీ పర్సు బస్సులో పారేసుకున్నాను. ఇంటికి పోవటానికో హండ్రెడ్ ఇవ్వరూ' అంటూ అర్థించింది.

అలాంటి సుందరికి, వంద నోటిచ్చి అవమానించనా?

'రండి, కార్లో డ్రాప్ చేస్తాను' అంటూ ఆఫర్ చేశాను.

వర్షం ఆగగానే యిద్దరం బయల్దేరాం. రెండు మైళ్లు వెళ్లామో లేదో, వెనకనుండి వస్తున్న కారు హెడ్ లైట్ వెలుగు మా మీద పడింది.

అమ్మాయి వెనక్కు తిరిగి చూసి కెవ్వుమని కేక వేసింది.

"నా భర్త మనల్ని వెంబడిస్తున్నాడు. ఆయన పరమ కిరాతకుడు. దొరికామంటే యిద్దర్నీ చంపేస్తాడు" అంటూ భోరుమంది.

పొరపాటు జరిగిందని అంగీకరించటం తప్ప నేను చెయ్యగలిగిందేమీ లేదు. ఇలాంటి సాహసాలు సినిమాల్లో బాగుంటాయి. నిజ జీవితంలో కాదు.

కారాపి, బ్రీఫ్ కేస్ పట్టుకుని, నాకే దురుద్దేశమూ లేదని చెప్పటానికి ప్రయత్నించాను. కాని, ఆమె భర్త నిజంగా రాక్షసుడే. బూతులు తిట్టి, నన్ను కొట్టినంత పని చేసి, బ్రీఫ్ కేస్ లాక్కుని వెళ్లిపోయాడు." అంటూ కథ ముగించాడు యువకుడు.

"కంగ్రాచ్యులేషన్స్. బ్రీఫ్ కేస్‌లో ఎంతుంది?"

"మూడు లక్షల రూపాయలు"

"గోవిందా! గోవింద!!" అన్నాడు డిటెక్టివ్ నవ్వాపి.

డిటెక్టివ్‌కు తెలిసిన క్లూ ఏమిటి.

సమాధానం : రాత్రివేళ హెడ్‌లైట్ల వెలుగులో, కారులో వున్న వ్యక్తుల్ని పోల్చుకోవటం అసాధ్యం. ఇది ఆడకిలాడీ ఆడిన నాటకం.

---

కూచేసే వుండిపోయింది. రాజ్‌కుమార్ ఆపకుండా పచార్లు చేస్తూనే వున్నాడు.

ఏడు... కోట్లు! రాస్కెల్... తాను ఏడుకోట్లు ఇవ్వగలడని ఎలా అనుకున్నాడు? అంతడబ్బు తను సర్దగలడని ఎందుకునుకున్నాడు. ఇడియెట్! స్కౌండ్రల్! రోగ్! లాలస విలువ ఏడుకోట్లా?! తమ కలల పంటకు విలువ కట్టే అర్హత వాడికెక్కడిది? ఏడు కాదు; డెబ్బై కాదు? ఏడు వందల, ఏడు లక్షల, ఏడు కోట్ల కోట్లు పారేసి లాలసను దక్కించుకుంటాడు తను... ఉంటే! బిడ్డ విలువ కన్నవారికి తెలుసు!

నిశ్చల కుమిలికుమిలి ఏడుస్తున్న శబ్దం రాజ్ కుమార్ ఆలోచనలకి అంత రాయం కలిగించింది. అతను సోఫావైపు చూశాడు. నిశ్చల బోర్లా పడుకుని రోదిస్తోంది. రాజ్‌కుమార్ దగ్గరగా వెళ్ళి, ఆమె వీపు మీద చెయ్యి వేశాడు.

"నిశ్చలా..."

నిశ్చల తలెత్తి చూసింది. ఆమె ఎర్రటి కళ్ళు ఆవేదనకు పట్టిన భూతద్దాల్లా వున్నాయి. ఎనలేని దుఃఖం, భయం – ఆమె మొహంలో కాపురం చేస్తున్నాయి.

"నా బిడ్డ... నా పాప... నా పాప నాకు కావాలి!" నిశ్చల బావురుమంది. రాజ్‌కుమార్ ఆమెని మెల్లిగా కూర్చోబెట్టాడు. పక్కనే కూచుని, అనునయంగా ఆమె తల నిమిరాడు. నిశ్చల తలను అతని భుజం మీద వేసి, అతన్ని వాటేసుకుని దీనంగా ఏడవ సాగింది.

రాజ్‌కుమార్ గుండె కరిగిపోతోంది. అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అతని లోని నిస్సహాయతను కబళించివేస్తూ ఏదో ఆవేశం బుసలు కొడుతూ లేస్తోంది.

"నిశ్చలా! కళ్ళు తుడుచుకో! వాడడిగింది పారేస్తాను! లాలసను నీకు తెచ్చిస్తాను!" నిబ్బరంగా పలికిన అతని కంఠంలో ధైర్యం ధ్వనించింది.

నిశ్చల తలెత్తి అతని మొహంలోకి చూసింది. "ఎక్కణ్నుంచీ తెస్తారు.. ఏడు కోట్లు?"

రాజ్‌కుమార్ మౌనంగా ఆమె నుండీ విడిపించుకుని పైకి లేచాడు. జేబు లోంచీ మొబైల్ తీశాడు. ఒక నంబర్ డయల్ చేశాడు. నిశ్చల అతన్నే చూస్తోంది.

"రాజ్... వాట్ న్యూస్?" అవతలికంఠం.

"రవీ! ఇండస్ట్రీలో నా వాటా అమ్మేస్తున్నాను. నాకు ఏడు కోట్లు కావాలి..."

"రాజ్... పిచ్చిపట్టిందా?" అటు వైపునుంచీ రవికిరణ్ ఆశ్చర్యంగా అన్నాడు.

"పట్టిందనే అనుకో, రవీ! నాకూ, నిశ్చలకూ మా కూతురు కావాలి. అందుకు ఏడుకోట్లు కావాలి... మనిద్దరం పుట్టుకతో పార్టనర్లం! నువ్వు వద్దంటే మరెవరికేనా అమ్మి పారేస్తాను..."

"రాజ్... తొందరపడొద్దు...పోలీసుల సహాయం తీసుకుందాం.."

"ఓకే రవీ! థాంక్యూ! మొదట నీకు ఆఫర్ చేయడం ధర్మం! చేశాను! నీకు నా వాటా కొనే ఉద్దేశం లేనట్టుంది! నువ్వు తీసుకుంటే నేను సంతోషించే వాణ్ని! మన తండ్రులూ అదే కోరుకుంటారు. ఓకే... ఓపెన్ మార్కెట్ ట్రై చేస్తా.."

"రాజ్.. ఆగు... నన్ను తరుముతున్నావ్! ఓకే... రాజ్.. నీకోసం.. పాప కోసం... మన కోసం.. నీ వాటాను తీసుకుంటాను... భవిష్యత్తును దృష్టిలో వుంచుకుని తీసుకుంటాను! రేప్పొద్దున నువ్వడిగితే నీ వాటా నీకు తిరిగి అమ్మడానికి తీసుకుంటాను..."

"థాంక్యూ రవీ..."

"కానీ... నువ్వన్నట్టు ఏడు కోట్లకి తీసుకోను..." రవికిరణ్ అడ్డు తగిలాడు.

"రవీ..."

"మన సంస్థ మార్కెట్ విలువ కట్టిస్తాను... దాని ప్రకారం న్యాయమైన ధర చెల్లించి కొంటాను! ఈ రవికిరణ్ నిన్ను ఎక్స్‌ప్లాయిట్ చేయడు!"

"థాంక్యూ రవీ, థాంక్యూ... యూ ఆర్ రియల్ ఫ్రెండ్!"

"రాజ్, నీకు తెలుసు... నా దగ్గరా అంత రెడీ కాష్ లేదు!" నా వాటా, నీ వాటా కలిపి, తాకట్టు పెట్టి – సొమ్ము రెడీ చేయాలి... దానికోసం... నీ వాటా నాకు విక్రయం చేసేలా అగ్రిమెంట్..."

"అరగంటలో ఆఫీసులో వుంటా! లాయర్ని పిలిపించి అగ్రిమెంటు రాయించు!" రాజ్‌కుమార్ అన్నాడు.

సెల్ ఆఫ్ చేసి, రాజ్‌కుమార్ భార్యవైపు చూశాడు. నిశ్చల లేచి, అతని దగ్గరకు వచ్చింది. తడిగా మెరుస్తున్న గిన్నెల్లాంటి కళ్ళతో అతని ముఖంలోకి చూసింది. ఆమె పెదవులు అదురుతున్నాయి.

"నిశ్చలా! మన ప్రాణం లాలస; రవిరాజా ఇండస్ట్రీస్ కాదు! అవునా?" రాజ్‌కుమార్ చిరునవ్వుతో అడిగాడు.

నిశ్చల దగ్గరగా జరిగి అతని ఛాతీమీద తల చెంపను ఆన్చింది. ఆమెకి ధైర్యం చెప్తున్నట్టు రాజ్‌కుమార్ చేతులు ఆమె వీపును నిమిరాయి...

***

"రాజ్‌కుమార్?"

"యస్... లాలస ... ఎలావుంది?" కిడ్నాపర్ కంఠాన్ని గుర్తుపట్టిన రాజ్ కుమార్ అడిగాడు, వణికే కంఠంతో

"చెప్పానుగా! నేను 'లాభంగా' వుంటే, నీ ముద్దుల కూతురు 'క్షేమంగా' వుంటుంది!" కిడ్నాపర్ వికటంగా నవ్వాడు. "రెడీగా వుందా?"

"ఉంది... నువ్వడిగినంతా యిస్తున్నాను. పాపకు ఏ ఆపద రాకూడదు! పాపను..."

"ఓకే...చాలు! అర్థమైపోయింది!" కిడ్నాపర్ అడ్డొస్తూ నిర్లక్ష్యంగా అన్నాడు.

"రెండు పెద్ద సూట్‌కేసుల్లో సర్దు! తాళాలు వేయ్! సర్దేముందు నోట్ల నంబర్లు నోట్ చేసుకోవద్దు! పాపకు ప్రాణాపాయం! తెల్లారగట్ల నాలుగు గంటలా నలభై నాలుగు నిమిషాలకు అత్తాపూర్ సమీపంలోని పురాతన ఆలయాల ఏరియా చేరుకో! అక్కడ విగ్రహం లేని మహాలక్ష్మి ఆలయం వుంది! లక్ష్మి విగ్రహం వుండాల్సిన చోట నువ్వు మూటగట్టిన లక్ష్మిని పెట్టెయ్! తిరిగి చూడకుండా ఇంటికెళ్ళిపో!!"

"నా కూతురు... నా కూతురు సంగతేంటి?"

"నువ్వు – నేను చెప్పింది తప్పా మరేదీ చేయలేదని రూఢి చేసుకున్నాక – సాయంత్రం నాలుగు నలభై నాలుగుకి పిల్ల ఎక్కడుంటుందో చెప్తాను..."

"ప్లీజ్.. నువ్వు చెప్పినట్టే చేశాను; చేస్తాను.. పాపను.." రాజ్‌కుమార్ మాటను కట్ చేస్తూ టెలిఫోన్ కట్ అయ్యింది.

***

రాజ్‌కుమార్ ఇల్లు పండగ వాతావరణంలా కళకళలాడుతోంది. సోఫా మీద తల్లిదండ్రులిద్దరి మధ్య కూచున్న లాలస చిరునవ్వులు చిందిస్తోంది. లాలస రెండు బుగ్గలూ అమ్మా, నాన్నల ముద్దులతో ఎర్రగా కందిపోయి వున్నాయి.

వాళ్ళ ఎదురుగా సోఫాలో కూచున్న ఎస్పీ రంజన రాజ్‌కుమార్ వైపు అసంతృప్తితో చూసింది. ''మీరు పొరపాటు చేశారు! నాకు మాట మాత్రం చెప్పి వుంటే బాగుండేది! వలవేసి..''

''సారీ రంజనా... పాపప్రాణాలు దక్కితే చాలన్న ఆదుర్దాలో వుండి పోయాం... పోలీసుల్ని కలుసుకుంటే, పాపను... చంపేస్తానన్నాడు!'' నిశ్చల అంది.

''అవునాంటీ... ఆ దొంగాడు సినిమాలో విలన్‌లా ఉన్నాడు! చంపేస్తా నంటూ ఎన్నిసార్లు బెదిరించాడో!'' లాలస గుడ్లు పెద్దగా చేసుకుంటూ అంది.

''ఎక్కడికి తీసుకెళ్ళాడో, ఎలా తీసుకొచ్చాడో చెప్పగలవా, లాలసా?'' రంజన ప్రశ్నించింది.

''తీసుకెళ్ళినప్పుడూ, తీసుకొచ్చినప్పుడు కళ్ళకి అడ్డంగా నల్లగుడ్డ కట్టేశాడుగా! నాకేమీ కనిపించ లేదాంటీ!''

''పోనీ ఆ దొంగాడు ఎలా వున్నాడో చెప్పు!''

''లావుగా, పొడుగ్గా - రౌడీలా వున్నాడు. వాడు మాట్లాడితే ఒకటే కంపు! మరే... చీకటిగది లోంచీ నన్ను ఒకసారి బైటికి తీసుకొచ్చినప్పుడు - అక్కడ ఇంకొకడున్నాడాంటీ... నల్లగుడ్డలూ, నల్ల గెడ్డం! నల్లటి మీసాలుగా! అంతా నలపే! అయితే - మంచివాళ్ళా వున్నాడు. పాపం... వెళ్ళి పోయే ముందు ''పాపజాగర్త! భయపెట్టకు!'' అని చెప్పాడు దొంగాడితో!''

''రంజనగారూ... అంతటితో వదిలేద్దాం... డబ్బుపోతే పోయింది! పాప దక్కింది! మా కంతే చాలు! జరిగిందంతా లాలసకు గుర్తు చేయడం దేనికి?'' రాజ్‌కుమార్ పాపను దగ్గరగా లాక్కుంటూ అన్నాడు.

''హాయ్! లాలసా!'' గుమ్మంలోంచీ వస్తూ ఉత్సాహంగా పిలిచింది సంగీత. అందరూ చూశారు. పెద్ద గిఫ్టు ప్యాకెట్ పట్టుకుని సంగీత వెంట వస్తున్నాడు రవికిరణ్.

''హాయ్ ఆంటీ!'' అంటూ లాలస సంగీతవైపు పరుగెట్టింది. సంగీత లాలసను ఎత్తుకుని బుగ్గల మీద ముద్దులు కురిపించింది...

లాలస సంగీత చేతుల్లోంచీ కిందికి జారి, అమ్మా నాన్నల మధ్య కూచుంది. రవికిరణ్ సోఫా ముందు నిలుచుని, గిఫ్ట్ ప్యాకెట్‌ని లాలస వైపు చాచాడు. ''వెల్‌కమ్ హోమ్ లాలసా! ఏ గిఫ్ట్ ఫ్రం అంకుల్!''

''థాంక్యూ అంకుల్!'' అంటూ అందుకుంది లాలస. పాకెట్‌ని నిశ్చలకు అందించి, సోఫా మీద నిలబడింది. రెండు చేతుల్తో రవికిరణ్ ముఖాన్ని పట్టుకుని అతని బుగ్గ మీద ముద్దు పెట్టింది.

''ఓ! థాంక్యూ ప్రిన్సెస్!'' అంటూ రవికిరణ్ లాలసను ముద్దెట్టుకున్నాడు.

లాలస రెప్పవేయకుండా అతని మొహంలోకే చూస్తూ వుండి పోయింది.

''ఏంటమ్మా అలా చూస్తున్నావ్, అంకుల్ని?'' నిశ్చల నవ్వుతూ అడిగింది.

''అంకుల్! గెడ్డమూ, మీసాలూ, నల్లడ్రస్సు తీసేశారేం?'' లాలస తల్లి ప్రశ్నను వినిపించుకోకుండా అంది.

రవికిరణ్ ఉలిక్కి పడ్డాడు. ''గెడ్డం మీసాలా? నల్ల డ్రెస్సా?''

''అవునంకుల్! ఆ దొంగాడు నన్ను దాచి వుంచిన దెయ్యాల యింటికి వచ్చారుగా! అసలు 'మీరు 'పాప జాగర్త' అని చెప్పకపోతే, వాడు నన్ను చంపేసే వాడంకుల్! ''నేను పిలిచానంకుల్ మిమ్మల్ని...''

రవికిరణ్ పిచ్చివాడిలా అటూ, యిటూ చూశాడు.

రాజ్‌కుమార్, నిశ్చల, సంగీత - ముఖ్యంగా రంజనా ఆశ్చర్యంతో చూస్తున్నారు.

''ఏంటి? ఏంటిది? ఏమ్మాట్లాడుతోంది పాప?'' ఎవర్నీ ఉద్దేశించకుండా అన్నాడు రవికిరణ్. ''డాక్టర్‌కి చూపించారా!''

''ఒక్క క్షణం!'' ఎస్పీ రంజన దగ్గరగా వస్తూ అంది. ''లాలసా! ఈ అంకుల్ గెడ్డం మీసాలతో వచ్చాడా?''

''అవునాంటీ! ఫ్యాన్సీ డ్రెస్సులాగా వేషం వేసుకొచ్చాడు!''

''లాలసా...'' రవికిరణ్ అరిచాడు ఆశ్చర్యంగా.

''ఉష్!'' రంజన అతన్నివారించి, లాలస వైపు తిరిగింది. ''లాలసా, మరైతే ఇప్పుడు అంకుల్‌కి గెడ్డమూ, మీసాలు, నల్ల డ్రెస్సు లేవుగా? ఎలా పోల్చు కున్నావ్?''

''కళ్ళు చూసి, ఆంటీ! అంకుల్ ఏ వేషంలో వున్నా ఇట్టే పోల్చేస్తాను, కళ్ళు చూసి! నిన్నకూడా అక్కడ పిలిచాను 'అంకుల్! అంకుల్!' అంటూ. అంకుల్ మాట్లాడకుండా వెళ్ళిపోయారు. దొంగాడు నా నోరు మూసే శాడు!''

''మిస్టర్ రవికిరణ్... '' రంజన ఏదో చెప్పబోయింది.

''ఈ పిల్లకు - కిడ్నాప్‌తో పిచ్చెక్కింది! నేను.. నేను...''

రంజన చేతిలో రివాల్వర్ ప్రత్యక్షమైంది. ''రవికిరణ్! యూ ఆర్ అండర్ అరెస్ట్!''

రవికిరణ్ పిచ్చివాడిలా చూశాడు.

***

తన ఎదురుగా కుర్చీల్లో కూచున్న రాజ్‌కుమార్నీ, నిశ్చలనూ, లాలసనూ ఎస్పీ రంజన చిరునవ్వుతో చూసింది. ''రవికిరణ్ ఏడుస్తూ మొత్తం కక్కేశాడు. సంస్థ మీ కంట్రోల్‌లోకి వచ్చినప్పట్నుంచీ మీ వాటా మీద అతని కన్నుపడింది! అమ్మకానికి అడిగితే మీరు ఇవ్వరని తెలుసు! అంచేత రెండు వైపులా పదునున్న పథకం వేశాడు. పాప మీ ఆరోప్రాణం. పాపను కిడ్నాప్ చేసి, ఇవ్వలేనంత మొత్తం డిమాండ్ చేసి, మీ వాటాను అమ్మేపరిస్థితి కల్పించడం! మీ చేతే అడిగించుకుని కొనుక్కోవడం! దీంతో రెండు లాభాలు! వ్యాపారం పూర్తిగా తనదవుతుంది! కొను క్కోవడానికి మీకు యిచ్చిన సొమ్ము వెంటనే తిరిగొచ్చేస్తుంది! పది కోట్ల పైగా విలువ చేసే మీ వాటా వ్యాపారం తేరగా అతని జేబులో కెళ్ళిపోతుంది! ఇదీ రవికిరణ్ మాస్టర్ ప్లాన్!''

''స్కౌండ్రల్! వాడి పథకానికి పడిపోయాను! అగ్రిమెంట్ రాసిచ్చి, డబ్బు తీసుకున్నాను! వాడి డబ్బు వాడికే యిచ్చేశాను! రెండూ పోయాయి!'' రాజ్‌కుమార్ అన్నాడు.

''మోసంతో, కుట్రతో రాయించుకున్న అగ్రిమెంట్ నిలవదు! మీకు నష్టం రాదు! రవికిరణ్‌కే, కిడ్నాపర్లా నటిస్తూ ఫోన్లో మాట్లాడిన వ్యక్తికీ శిక్ష తప్పదు! ఎందుకోతెలుసా? బాలసాక్ష్యం, బ్రహ్మ సాక్ష్యం!'' రంజన నవ్వింది.

''రవికిరణ్‌లో యిలాంటి రాక్షసుడున్నాడని కనిపెట్టలేక పోయాను!'' రాజ్ కుమార్ సిగ్గుపడుతూ అన్నాడు.

''లాలస కనిపెట్టేసిందిగా, కనికట్టుతో!'' రంజన నవ్వుతూ అంది.

అందరూ నవ్వారు.

*


ఈడు... జోడు ... అందం... ఐశ్వర్యం
కళ్యాణం ... కాకతీయ!

కాకతీయ మ్యారేజస్ ప్రై. లిమిటెడ్.
103, 109 & 203, విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, చర్మాస్ వెనుక,
అమీర్‌పేట్, హైదరాబాద్. 500 073.
ఫోన్స్: 040-23747777 , 9391999999



FREE online Registration & Free search
www.kaakateeya.com
www.telugumarriages.com
www.kannadamarriages.com
www.tamilmarriages.com

| | |
|---|---|
| అమీర్‌పేట్ | నెల్లూరు |
| కూకట్‌పల్లి | తిరుపతి |
| దిల్‌షుఖ్‌నగర్ | కర్నూలు |
| విజయవాడ | (చెన్నయ్) టి.నగర్ |
| గుంటూరు | బెంగుళూర్ |
| తెనాలి | సేలం |
| విశాఖపట్నం | మధురై |
| రాజమండ్రి | వెల్లూరు |
| కాకినాడ | తిరుచి |
| ఖమ్మం | పాండిచ్చేరి |
| ఒంగోలు | ఈరోడ్ |
| | ఏలూరు |

చెన్నయ్ (అన్నానగర్), చెన్నయ్ (పోరూర్), (చెన్నయ్) తాంబరం, జయానగర్, కోయంబత్తూరు.